

29న భీమవరం రానున్న షర్మిల

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు హరికుమార్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 29న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి భీమవరం రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో పార్టీ సర్వసభ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. 29న ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, జిల్లాలోని కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యడ్ల శివాజీ, జనరల్ సెక్రటరీ పుచ్చకాయల రత్నరాజు, సెక్రటరీ కొర్రా శ్రీనివాస్, తణుకు కోఆర్డినేటర్ దర్శిపో రామకృష్ణ, సెక్రటరీ మేడపాటి సాగర్, కోలుకోరి అర్జున్‌రావు, పెన్మెత్స రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఒడిదుడుకుల్లో ఆక్వారంగం..!

తగ్గని సీడ్, ఫీడ్ ధరలు.. దిగజారిన రొయ్య ధర

వాతావరణ మార్పులతో నష్టాల ఊబిలో రైతులు



ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా హబ్‌గా పేరు ప్రఖ్యాతలుగాంచింది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా. అటువంటి జిల్లాలో రొయ్యలు, చేపల రైతులు ఈ ఏడాది నష్టాల ఊబిలో కూరుకుపోయారు. సాగు వ్యయంలో 50 శాతానికిపైగా మేతలకే అవుతోంది. వాటి ధరలు తగ్గించాలని రైతులు కోరుతున్న ప్రభుత్వం నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. అదే క్రమంలో అమెరికా సుంకాల ప్రభావం ఆక్వా మార్కెట్‌పై పడింది. రొయ్యకు సరైన ధర లేకపోవడంతోపాటు ఎగుమతులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హేచరీల స్థాయిలో వైరస్ సమస్య కారణంగా రొయ్య సీడ్ చెరువులో వేసిన 25 రోజుల్లోనే చనిపోవడం తీవ్ర నష్టాలకు కారణమైంది. ప్రతికూల వాతావరణం, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏడాది పొడవునా ఇబ్బందులు తప్పడం లేదు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రొయ్యల సాగు చాలా విస్తృతంగా ఉంది. రాష్ట్రంలో ఆక్వా (రొయ్యలు, చేపల) చెరువులు 5.75 లక్షల ఎకరాల్లో ఉండగా, అందులో 2.63 లక్షల ఎకరాలు పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2.63 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. ఈ ఏడాది మొదటి పదినెలల్లో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో దిగుబడితోపాటు ఆదాయం కూడా పడిపోయింది. దీనికితోడు ఈ ఏడాది రొయ్య ధరలు గణనీయంగా పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వేసవిలో వాతావరణంలో మార్పులు రావడంతో ఈ ప్రాంతంలో రొయ్యల చెరువుల్లో ఒక్కసారిగా వైరస్ విజృంభించింది. వేలాది ఎకరాల్లో తెల్లమచ్చ వైరస్ సోకింది. ఆక్సిజన్ అందక చేపలు తేలిపోతున్నాయి. దీంతో రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయారు.

వంద కౌంట్ ధర రూ.250 ఉండాల్సి ఉండగా దళారులు రూ.220కు కొనుగోలు చేస్తున్నారు. కిలో రొయ్యకు రూ.30 నుంచి రూ.40 వరకూ దండుకుంటున్నారు. ఆక్వా ప్రొసెసింగ్ యూనిట్లకు కోట్లాది రూపాయలు సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వాలు రైతుల పట్ల మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నాణ్యమైన సీడ్ దొరకకపోవడం, వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ వంటి వాటి వల్ల ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తాజాగా వాతావరణం చల్లబడటంతో ఆక్సిజన్ లోపంతో రొయ్యలు ఆక్సిజన్ అందక తేలిపోతుండటంతో రైతులు నష్టపోతున్నారు.

రొయ్యల ధరలు

20 కౌంట్	రూ.500
25 కౌంట్	రూ.500
30 కౌంట్	రూ.435
40 కౌంట్	రూ.355
45 కౌంట్	రూ.330
50 కౌంట్	రూ.320
60 కౌంట్	రూ.300
70 కౌంట్	రూ.270
80 కౌంట్	రూ.250
90 కౌంట్	రూ.230
100 కౌంట్	రూ.220

తగ్గని విద్యుత్ ఛార్జీల భారం

గుదిబండగా మారిన విద్యుత్ ఛార్జీల భారాన్ని కూటమి ప్రభుత్వం తగ్గిస్తే ఆక్వా రంగం కోలుకుంటుందని రైతులు చెబుతున్నారు. ఏరియేటర్లతో చేపలు, రొయ్యలను బతికించుకునేందుకు ప్రభుత్వం విద్యుత్ రాయితీని వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు.

మాది యుపి స్కూల్‌గానే ఉంచండి

10 రోజులుగా కోడూరు స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన

టీసీలు తీసుకునేందుకు నిరాకరణ

స్పందించని పాలకులు, ఉన్నతాధికారులు




పైతరగతులకు చెందిన 20 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాఠశాల విద్య వ్యవస్థలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితంగా మండలంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా డీగ్రేడ్ అయిన మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలో తొమ్మిది యుపి పాఠశాలలు డీ గ్రేడ్ అయ్యాయి. ఆ పాఠశాలల్లో విద్యార్థులు చాలా దూరంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్లి చదువుకోవాలంటే పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలోని యుపి పాఠశాలలన్నీ బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారి 6, 7, 8 తరగతులు రద్దు కావడంతో ఆ పాఠశాలల విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న హైస్కూల్స్‌కు వెళ్లి చదువుకోవడం కష్టతరంగా మారింది. కోడూరులోని యుపి స్కూల్ విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ పాఠశాలలో 6, 7, 8 తరగతులకు చెందిన 20 మంది విద్యార్థులు ఉన్నారు. గత 40 సంవత్సరాల నుండి కోడూరులో యుపి స్కూల్ ఉంది. ఈ క్రమంలో బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా డీగ్రేడ్ చేయడంతో 20 మంది విద్యార్థులు సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాలపర్రు లేదా ముదినేపల్లి హైస్కూళ్లకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అదీ జాతీయ రహదారి వెంబడి రాకపోకలు సాగించాల్సి రావడంతో తమ పిల్లలను అంతదూరం పంపేందుకు తల్లిదండ్రులు సైతం వెనుకాడుతున్నారు. దీనిపై పది రోజులుగా తమ పాఠశాలను యుపి పాఠశాలగానే కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనబాట పట్టారు. తమకు తెలియకుండానే మారుమూల గ్రామమైన కోడూరు యుపి పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చడం ఏమిటని విద్యాశాఖాధికారులను నిలదీస్తున్నారు. ఇటీవల గ్రామస్తులు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌కు సైతం వినతిపత్రం అందించారు. ఈ నెల 12 నుంచి ఆ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఆరో తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థులతోపాటు 7, 8వ తరగతి విద్యార్థులు మొత్తం 20 మంది ప్రతిరోజూ పాఠశాలకు వస్తూనే ఉన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఉపాధ్యాయులు హాజరు వేస్తూ పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. పై తరగతులు కొనసాగించాలా లేదా, అనేది విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. పాఠశాల తెరిచి రెండు వారాలైనప్పటికీ ఇంకా గందరగోళ పరిస్థితి కొనసాగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో మొన్నటి వరకు ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఎంటిఎస్ ఉపాధ్యాయిని పని చేసేవారు. ఎంటిఎస్ ఉపాధ్యాయిని ఇటీవల బదిలీల్లో వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులే ఎనిమిది తరగతులకు పాఠాలు బోధిస్తుండటం గమనార్హం. దీనిపై మండల, జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం 6, 7, 8 తరగతుల విద్యార్థులకు పుస్తకాలు ఇంకా సరఫరా చేయలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కోడూరు యుపి పాఠశాలను యథాతథంగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మా స్కూలు మాకే కావాలి



కొడాలి ఝాన్సీలక్ష్మి, ఎస్ఎంసి సభ్యురాలు

గత 40 ఏళ్లగా ఉన్న మా యుపి స్కూల్ మాకే కావాలి. యుపి స్కూల్‌ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలగా మార్చడం తగదు. మా స్కూలును గతంలో ఉన్న మాదిరిగానే యుపి స్కూల్‌గా కొనసాగించాలి.

అంత దూరం పిల్లల్ని పంపలేం



వంకా ప్రమోద్, విద్యార్థి తండ్రి, ఆటో డ్రైవర్

మా పిల్లలను పది కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు పంపలేం. అవసరమైతే మా పిల్లలను బడి మాన్పించేస్తాం. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. బస్సు, ఆటో సౌకర్యం లేదు. దీంతో పిల్లలు ఎటూ వెళ్లలేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో పిల్లలను అంత దూరం పంపలేం.

మా స్కూల్లోనే చదువుకుంటా



వినయకుమార్, 8వ తరగతి విద్యార్థి

నేను మా స్కూల్‌లోనే చదువుకుంటా. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు వెళ్లలేను. రహదారి సౌకర్యం సరిగా లేదు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అంతదూరం నేను వెళ్లలేను. మా ఊరిలోనే చదువుకుంటా.

అంత దూరం వెళ్లాలంటే భయమేస్తోంది



శ్రీనిధి, ఏడో తరగతి విద్యార్థిని

నేను అంత దూరం వెళ్లి చదువుకోవాలంటే భయమేస్తోంది. జాతీయ రహదారిని దాటుకుని పది కిలోమీటర్లు వెళ్లాలంటే భయంగా ఉంది. మా గ్రామంలో 8వ తరగతి వరకు స్కూలును కొనసాగించాలి.

జాయింట్ ఎల్‌పిఎం సమస్యల పరిష్కారానికి చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి - పాలకోడేరు

జాయింట్ ఎల్‌పిఎం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం గరగపర్రు గ్రామంలో జాయింట్ ఎల్‌పిఎంలు పట్టాదారులుగా నమోదైన భూములను ఆయన క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో 439 జాయింట్ ఎఎల్‌పిఎంలు ఉన్నాయని జెసికి వివరించగా, గ్రామంలో వారానికి రెండు రోజులు ప్రత్యేక క్యాంపులను నిర్వహించి సమస్యలను పరిష్కరించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలకు ఇబ్బంది లేకుండా సబ్‌డివిజన్ చేయించాలన్నారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు వారి భూములు విభజన చేసేందుకు నామమాత్రపు దరఖాస్తు రుసుము రూ.50ను గ్రామ సచివాలయాల్లో చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే ఇన్‌ఛార్జి అధికారి కె.శ్రీనివాసరావు, డివిజనల్ సర్వే అధికారి మల్లికార్జునరావు, మండల సర్వేయర్ సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులకు, వికలాంగులకు ఇంటికే రేషన్ సరుకులు

60 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, మంచంపై ఉన్న వారికి ఇంటికి రేషన్ సరుకులు అందజేస్తున్నామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గరగపర్రు గ్రామంలో షాపు నెంబర్ 43కు సంబంధించిన నిత్యావసర సరుకులను కార్డుదారుల ఇంటికెళ్లి జెసి అందజేశారు. ప్రతి నెలా ఆఖరి ఐదు రోజుల్లో కచ్చితమైన తూకంతో సరుకులను ఇంటికి తీసుకెళ్లి అందజేయాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.భారత రాజ్యలక్ష్మి, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, సిఎస్‌డిటి శేషయ్య, ఆర్ఐ పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్షేమ పథకాలు అమలు చేయాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికుల జెఎసి పిలుపుమేరకు గురువారం నాల్గో రోజు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. జెఎసి నాయకులు మరిపూడి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన కోరికలను తీర్చాలన్నారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు.

నరసాపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె నాల్గో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు.



నరసాపురం: మాట్లాడుతున్న సిఐటియు నేత త్రిమూర్తులు

సిఐటియు సంఘీభావం

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల ఆందోళనకు ప్రత్యక్షంగా మద్దతుగా రంగంలోకి దిగుతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోడి లక్ష్మణ్, మున్సిపల్ కార్మికులు సిహెచ్.వాసు, ఎం.సత్యనారాయణ, పి.వెంకటరత్నం, వి.ఫణీందర్, ఎ.మధు, సుజాత, డి.వరలక్ష్మి, అమీనా తదితరులు పాల్గొన్నారు.

భవనాలే.. విద్యార్థులేరీ..!

శివరావుపేటలోని పాఠశాలలో ఆరుగురు విద్యార్థులే

వెలవెల బోతున్న పాఠశాల

ప్రజాశక్తి - పెనుమంట్ర

కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ చేపట్టిన కొత్త విద్యా విధానంతో గత ప్రభుత్వం నాడు - నేడు కింద నిర్మించిన పలు పాఠశాలల భవనాలు విద్యార్థుల లేమితో వెలవెలబోతున్నాయని పలువురు విద్యా వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మార్టేరు శివారు శివరావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 13 మంది పిల్లలు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చారు. ప్రస్తుతం ఇక్కడ 1, 2 తరగతులకు సంబంధించి ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మిగిలిన 3 నుండి 5 తరగతులు చదివే ఏడుగురు పిల్లలను ఈ పాఠశాల నుంచి సుమారు కిలో మీటరు దూరంలోని ఆచంట - కోడేరు రోడ్డులోని చర్చి వెనుక భాగంలో ఉన్న నెగ్గిపూడిలోని మోడల్ ప్రయిమరీ స్కూల్లో విలీనం చేశారు. అయితే అంత దూరం వెళ్ల లేక వారిలో ఇద్దరు పిల్లలు వారికి నచ్చిన పాఠశాలల్లో చేరగా, ఐదుగురు మాత్రమే విలీనం చేసిన స్కూల్‌కు తప్పక వెళ్తున్నారని శివరావుపేట స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ కడలి విద్యాలక్ష్మి తెలిపారు. శివరావుపేట నుంచి నెగ్గిపూడి మోడల్ స్కూల్ వెళ్తే ఆచంట- కోడేరు రోడ్డు నిత్యం ఇసుక లారీలు, ట్రాక్టర్ల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీంతో తమ పిల్లలకు ఆ స్కూల్‌కు వెళ్లడానికి భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



శివరావుపేట మండల పరిషత్ పాఠశాల

అధికారులు స్పందించాలి

బొడ్డు మహంకాళమ్మ, విద్యార్థిని నానమ్మ

మా మనవరాలు నాగలక్ష్మి 5వ తరగతి చదువుతోంది. ఈ పాఠశాల నుంచి అంతదూరం చిన్న పిల్లలను పంపేయడం దారుణం. అంత దూరం పిల్లలు ఎలా వెళ్తారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

ఈ స్కూల్ మూతపడే అవకాశం ఉంది

చదలవాడ రాధిక, విద్యార్థిని తండ్రి

మా అబ్బాయి కిషోర్ 5వ తరగతి చదువుతున్నాడు. ఇక్కడ బాగా పాఠశాలను నిర్మించారు. ఇక్కడ నుండి దూరంగా ఉన్న మరో స్కూల్‌కు పిల్లలను పంపడం వల్ల ఈ స్కూల్ మూత పడే అవకాశం ఉంది. విద్యాశాఖ అధికారులు పునరాలోచన చేయాలి.

పేదల ఇళ్ల కూల్చివేత ఆపాలి

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తణుకు

పేదల ఇళ్ల కూల్చివేత తక్షణం ఆపాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. స్థానిక ఆరోవార్డులో దేవస్థానం భూమిని ఆనుకుని ఉన్న కాలువ గట్టుపై 13 ఇళ్ల తొలగింపు ఆపాలని నినదించారు. అనంతరం తహశీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు అడ్డగర్ల అజయకుమారి, బొద్దాని నాగరాజు మాట్లాడుతూ కాలవ గట్టుమీద గత 35 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న వారి ఇళ్లు తొలగించడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇచ్చారనే కారణంగా ఇళు తొలగించాలని అనడం బాధాకరమన్నారు. ఇంటి స్థలం ఇచ్చినంత మాత్రాన ఇల్లు కట్టుకోవడం అంత సులువు కాదని అన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. అప్పటి వరకూ ఇళ్ల తొలగింపు ఆపాలని కోరారు. అర్ధరాత్రి కరెంట్ కట్ చేసిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం పేదల నివాస ప్రాంతానికి నేతలు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, గార రంగారావు, గుబ్బల గోపీ తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న బాధితులు, నేతలు

సిఐగా వస్తారనుకుంటే.. శవమై వచ్చారు..!

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మృతితో నరసాపురంలో తీవ్ర విషాదఛాయలు

ప్రజాశక్తి - నరసాపురం

'సిఐగా ఉద్యోగోన్నతి పొంది వస్తారనుకుంటే.. శవమై వచ్చావేంటయ్యా..' అని ఎస్ఐ ముద్దాల అశోక్ మృతదేహం వద్ద బంధువులు, స్నేహితులు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. తెలంగాణాలోని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో దుర్గాపురం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ ముద్దాల అశోక్ మృతి చెందిన సంగతి తెలిసిందే. అశోక్ మృతితో ఆయన స్వస్థలం నరసాపురం పట్టణంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ క్రమంలో అశోక్ మృతదేహాన్ని గురువారం సాయంత్రం నరసాపురం పట్టణంలోని 22వ వార్డు రుస్తుంబాదలోని స్వగృహానికి తీసుకొచ్చారు. అశోక్ తండ్రి నర్సింహమూర్తి సాధారణ రైతు. తల్లి గృహిణి. నర్సింహమూర్తికి ముగ్గురు కుమారులు, కుమార్తె. పెద్దకుమారుడు రైల్వేలో స్టేషన్ మేనేజర్‌గా పని చేసి రిటైరవ్వగా, రెండో కుమారుడు హెడ్ కానిస్టేబుల్‌గా తూర్పుగోదావరి జిల్లాలోనే పని చేస్తున్నారు. 1979 జనవరి 6న జన్మించిన అశోక్ చిన్ననాటి పోలీసు అవుతానని చెప్పేవారు. ఆయన విద్యాభ్యాసం మొత్తం నరసాపురంలోనే సాగింది. వైఎన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన అశోక్ కఠోర శ్రమతో 2009 బ్యాచ్‌లో ఎస్ఐగా ఎంపికయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బొమ్మూరు, తుని, మండపేట, కొత్తపేట ప్రాంతాల్లో పనిచేసి ప్రస్తుతం ఆలమూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. సిఐగా ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్న ఎస్ఐ అశోక్ ఓ కేసు దర్యాప్తు నిమిత్తం హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో చోటుచేసుకున్న ప్రమాదంలో మృతి చెందడం అందరినీ కలిచి వేసింది. అశోక్‌కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం, చిన్న కుమారుడు పదో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితమే ఇంటికొచ్చి స్నేహితులు, బంధువులతో రెండు రోజులు గడిపి వెళ్లిన అశోక్ మృతిని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.



ఎస్ఐ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళు లర్పిస్తున్న ఎస్‌పి నయీం అస్మీ



ఎస్ఐ అశోక్ అంతిమయాత్ర

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

అశోక్ భౌతికకాయానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు, పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి నయీమ్ అస్మీ, ఎఎస్‌పి వి.భీమారావు, డిఎస్‌పిలు ఎస్.మురళీ మోహన్, టిఎస్ఆర్‌కె.ప్రసాద్, సహచర ఉద్యోగులు, బ్యాచ్‌మేట్స్ పెద్దసంఖ్యలో తరలొచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పట్టణంలోని రుస్తుంబాద నుండి గోదావరి తీరం వరకూ అంతిమయాత్ర నిర్వహించారు. పోలీసు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశ భవిష్యత్తును దెబ్బతీసే మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టాలని వరల్డ్ హ్యూమన్స్‌రైట్స్ ఇంటర్నేషనల్ ఛైర్మన్లు రావూరి బాలరాజు (హైదరాబాద్), చిక్కాల్ల మధుబాబు (హైదరాబాద్), వానపల్లి రామకృష్ణ (రాజమండ్రి) అన్నారు. జిల్లా పోలీస్, ఈగల్ శాఖ, వరల్డ్ హ్యూమన్స్ రైట్స్, మహిళాశిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని స్థానిక జెపి రోడ్డులో గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించినా, అమ్మినా 1972 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. వరల్డ్ హ్యూమన్స్ రైట్స్ ఎపి ఛైర్మన్ పత్రిపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. పోలీస్ ఈగల్ శాఖ అడ్వయిజర్ చెరుకువాడ రంగసాయి, శ్రీ ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపల్ మావుళ్లు మాట్లాడుతూ యువత భవిష్యత్తును, కుటుంబ జీవితాలను హరిస్తున్న గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం జెపి రోడ్డులోని ఆదిత్య కళాశాల నుంచి 400 మంది విద్యార్థులచే బొంబే స్వీట్స్ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ హరికృష్ణ, జయ కుమార్, ఈగల్ శాఖ కానిస్టేబుళ్లు కె.మురళీ, వి.నాగేశ్వరరావు, పీడీ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత గొంతు కోసిన ఉన్మాది అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తనతో పెళ్లికి నిరాకరిస్తుందని వివాహిత గొంతు కోసిన నిందితుడిని 24 గంటల్లో అరెస్టు చేశామని డిఎస్‌పి జయసూర్య తెలిపారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ పర్యవేక్షణలో నిందితుడు పోలిశెట్టి హేమంత్‌ను సాంకేతికత సాయంతో 24 గంటల్లోనే అరెస్టు చేశామన్నారు. అయ్యప్ప ఏజెన్సీలో వివాహిత పని చేస్తున్న సమయంలో అక్కడే పని చేస్తున్న హేమంత్ పరిచయం పెంచుకుని తనను పెళ్లి చేసుకోవాలని వేధించాడని తెలిపారు. ఈ క్రమంలో ఇంటికెళ్లి మళ్లీ పెళ్లి ప్రస్తావన తీసుకురాగా వివాహిత నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో ఆమె గొంతు కోసి, అక్కడి నుంచి పరారయ్యాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి జయసూర్య

నరసాపురం ప్రభుత్వాసుపత్రి ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

పోస్టుమార్టంకు సొమ్ము వసూళ్లే కారణం

ప్రజాశక్తి - భీమవరం

నర్సాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులపై వేటు పడింది. ఏప్రిల్ 16న మొగల్తూరులో ఉపాధి కూలీల మీదకు వ్యాన్ దూసుకెళ్లిన ప్రమాదంలో జి.గంగాభవాని (50), కె.పావని (47) అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతదేహాలను నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆ మృతదేహాలకు పోస్టుమార్టం చేయడానికి అక్కడి ఉద్యోగులు రూ.3 వేలు సొమ్ము తీసుకున్నారని మృతుల బంధువులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణలో అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అయిన పోస్టుమార్టం అసిస్టెంట్ డి.వెంకటేశ్వరరావును ఉద్యోగం నుండి తొలగించగా, జనరల్ డ్యూటీ అటెండర్ కె.ఉదయబాబును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంఆర్.రాజు సేవలు అమోఘం

ప్రజాశక్తి - కాళ్ల

భారత ప్రముఖ శాస్త్రవేత్త, గాంధేయవాది, పద్మశ్రీ ఎంఆర్ రాజు సేవలు అమోఘమని నరసాపురం పార్లమెంట్ మాజీ సభ్యులు గోకరాజు గంగరాజు తెలిపారు. పెదఅమిరంలో గురువారం ఎంఆర్.రాజు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ప్రపంచ, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తగా సేవలందించి పెదఅమిరంలో ఎంజిఎం ట్రస్ట్ స్థాపించి తద్వారా కేన్సర్ రోగులకు విశేష సేవలందించారన్నారు. భీమవరం ప్రాంతంలో పద్మశ్రీ పురస్కారం అందుకున్న గొప్ప వ్యక్తి ఎంఆర్ రాజుఅన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఎంఆర్.రాజు కుమారులు, రామ్‌కుమార్ రాజు, రంగరాజు, మనవడు వెంకటపతిరాజు, సాయి పాల్గొన్నారు.


రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంగరాజు

ఆచంట ఎంఇఒ-1గా శ్రీనివాస్ బాధ్యతలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండల విద్యాశాఖాధికారి-1 గా ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ఎన్.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంఇఒ -1గా పనిచేసిన ఎ.ఉషారాణి బదిలీల్లో భాగంగా కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆచంట మండల విద్యాశాఖాధికారి-2 రాజేంద్రప్రసాద్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘం నాయకులు, సిఆర్‌పిలు, ఆఫీసు సిబ్బంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో తాను ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేశానని, మండలంలో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రైతులు నారుమడులకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో రైతులు నారుమడులు వేయడానికి సిద్ధం కావాలని వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి సరిపల్లిలో పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే నారుమడులు వేయడం ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని, వెంటనే నారుమడులు వేయాలని చెప్పారు. అధిక వర్షాలకు పడిపోకుండా ఉండే విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి ఎస్.గీతాదేవి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం సరిపల్లిలో పొలాలను సందర్శించారు. వారివెంట రైతులు సతీష్, శ్రీనివాస్, తాతారావు, శ్రీను పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని జి.బాలయ్య అన్నారు. గణపవరం ఒకటో నెంబరు పాఠశాలకు చెందిన విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తమ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించాలని హెచ్ఎం కోరిక మేరకు ఆదినారాయణ పుస్తకాలు అందచేసినట్లు చెప్పారు. పాఠశాలలు అభివృద్ధికి దాతలు ముందుకు రావటం హర్షించ దగ్గ విషయమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మూర అలంకారం, జనసేన నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో జల్లికొమ్మర హైస్కూల్‌కు గురువారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థి చినమిల్లి రామాంజనేయులు రూ.20 వేల విలువైన కంప్యూటర్‌ను హైస్కూల్ హెచ్ఎం పుప్పాల ప్రకాష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రంగంలో మరింతగా అభివృద్ధి చెందడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సర్పంచి కురెళ్ల వెంకటరత్నం పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చిన రామాంజనేయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కవలకోదండ రాంబాబు, మహంకాళి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటేశ్వరరావు అన్నారు. వేంపాడు హిందూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో సుమారు 20 వేల రూపాయల విలువైన విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు గ్రామ సర్పంచి ఇర్రింకి పద్మావతి శ్రీనివాస్, పెద్దలు కోసూరి సత్యనారాయణ రాజు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆర్థిక సహాయంతో సమకూర్చిన విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలతో పాటు ఎస్ఎంసి ఛైర్మన్ వీరమల్లు పద్మశ్రీ, వైస్ ఛైర్మన్ దిగమర్తి స్వాతి, పెద్దలు బంగారు బాబు, గుడిమట్ల పర్రాలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఉండి

కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి కరణం పరంజ్యోతి అన్నారు. గురువారం పెద్దపుల్లేరులో కౌలు రైతులు, రైతులకు పంట సాగు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.దాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. కరణం పరంజ్యోతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ సుమారు 40 మంది కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కౌలు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందన్నారు. పంట సాగు హక్కు పత్రాల ద్వారా అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా 20 వేల రూపాయలు పెట్టుబడిని కౌలు రైతులు పొందేందుకు వీలుగా ఉంటుందన్నారు. దీనికి రైతులందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు బాబ్జి, ప్రసాద్, ముత్యాలపల్లి గణేష్, కౌలు రైతులు, భూ యజమానులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నవ్య జీవన్ తెలిపారు. వాలమర్రు, అరట్లకట్ట గ్రామంలోని స్కూళ్ల ఆవరణలో గురువారం ఆమె మాట్లాడారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెంటనే ఆశా కార్యకర్తను గానీ, ఎఎన్ఎంను గానీ సంప్రదించి వైద్య సహాయం పొందాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు అంగర వేణు గోపాలకృష్ణ, అంగర రవి, ఎంఎల్‌హెచ్‌పిలు యువతేజ, శిరీష, ఎఎన్ఎంలు సుజ్ఞానమని, రూపాదేవి, హెల్త్ అసిస్టెంట్ తారకసత్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా యువతతో పాటు అన్ని వర్గాలూ ఐక్యంగా పోరాడాలని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పోలీస్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, విద్యార్థులచే మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో కూటమి నేతలతో పాటు పట్టణ సిఐ కె.రజనీ కుమార్, ఎస్ఐలు, రూరల్ సిఐ గుత్తుల శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జివి మాల్ నుంచి పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో బొలిశెట్టి శ్రీనివాస్, డిఎస్‌పి విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర నుండి పోలీస్ ఐలాండ్ వరకూ సాగింది. ఎంఎల్ఎ మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం శారీరక, మానసిక, సామాజిక పరంగా వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రతిక్షణం తమ పిల్లలను గమనించాలన్నారు. సిఐ ఆది ప్రసాద్, రూరల్ సిఐ, రమేష్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మత్తు పదార్థాలకు ఎవరూ బానిస కావొద్దని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ కోరారు. మార్టేరు సెంటర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మత్తులోపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పెనుగొండ సిఐ రాయుడు విజయ్, ఎస్ఐ గంగాధర్, పెనుమంట్ర ఎస్ఐ స్వామి, ఆచంట ఎస్ఐ వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పాలకొల్లు :ర్యాలీలో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు

గణపవరం:మాదకద్రవ్యాలు దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గురువారం గణపవరం డిగ్రీ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానికులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, ఎస్ఐ మణికుమార్ మాట్లాడారు. కె.స్వరూపరాణి, ఎన్‌వివిఎన్‌బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసాపురం : వైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణా దినోత్సవం జరిపారు. సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి జి.గంగరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం భవిష్యత్తును నాశనం చేసుకోవడమే అన్నారు. యువత ప్రధానంగా చదువు మీద దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా చెడు సావాసాలు మానుకోవాలన్నారు. సిఐ బి.యాదగిరి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకం , అమ్మాయిలను, స్త్రీలను ఏడిపించడం చట్ట రీత్యా నేరమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, కెఎస్‌వి.రంగారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడుబాలాజీ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పంజా సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు.

పాలకొల్లు : అంతర్జాతీయ మాదకద్రవ్య వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డ్రగ్స్ వాడకం, పొగాకు వినియోగం దుష్ప్రభావాలపై పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. మాదక ద్రవ్యాల అమ్మకం, రవాణా, చట్టపరమైన శిక్షలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల, రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ యామిని, ఇఎల్ఇ క్లబ్ కో ఆర్డినేటర్ ఎ.వంశీ, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిన బూనాలని సిఐ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ డ్రగ్స్ రహిత దినోత్సవం సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని గాంధీ విగ్రహం నుండి కొత్త బస్టాండ్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహం వరకూ సుమారు 1000 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ సిఐ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యా వికాస్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, కార్తికేయ జూనియర్ కళాశాల, దుంపగడప ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, నేతలు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

పెదపుల్లేరులో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం గ్రామంలో ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఆధార్‌లో పొరపాట్లు నమోదైన వారు వెంటనే సరి చేయించుకోవాలని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.దాసు, డిజిటల్ అసిస్టెంట్ గొల్లమోని పాల్గొన్నారు.

విధిగా చెత్త సేకరణ చేయాలి

ఆచంట: గ్రామాల్లో అధికారులు ఇంటింటికీ వెళ్లి క్లాప్ మిత్రల ద్వారా చెత్త సేకరణ విధిగా నిర్వహించాలని ఎంపిడిఒ బిఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జారీ చేసిన పలు ఆదేశాలుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చైల్డ్ ఆధార్ నమోదు, బర్త్ సర్టిఫికెట్‌లు సచివాలయం ద్వారా జారీ చేయడం, బయోమెట్రిక్ అప్‌డేట్ సర్వే సిటిజన్ ఇకెవైసి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రానున్న వరదల నేపథ్యంలో వరద తాకిడి ఉండే గ్రామాల్లో ఫ్లడ్ మిటి గేషన్ ప్లాన్ తయారు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు సరఫరా అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. ఇఒపిఆర్‌డి జి.నరసింహారావు, కార్యదర్శులు హనుమంతరావు, దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగంలోకి రైతు సేవా కేంద్రం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఉండి

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. పెదపుల్లేరు గ్రామంలోని రైతు సేవా కేంద్రం శుక్రవారం తెరుచుకోనుంది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి కరణం పరంజ్యోతి మాట్లాడుతూ ఇక్కడ గ్రామ వ్యవసాయ సహాయకునిగా పనిచేస్తున్న తనకు ఉద్యోగోన్నతి కారణంగా ఉండి వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చిందని, తన స్థానంలో చెరుకువాడ గ్రామ వ్యవసాయ సహాయకునిగా పనిచేస్తున్న గంగాధర్‌ను ఇన్‌ఛార్జిగా ఉన్నతాధికారులు నియమించాని తెలిపారు. రెండు గ్రామాల్లో విధులు నిర్వహించడం పని భారం కారణంగా గత కొన్ని రోజులుగా అవసరమైనప్పుడు మాత్రమే పెదపుల్లేరు రైతు సేవ కేంద్రాన్ని తెరిచేవారని తెలిపారు. ఇకపై రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేశారు.

శిక్షణను వినియోగించుకోండి

మొగల్తూరు:మహిళలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులోని వుడియారు పేటలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకుని కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలన్నారు. ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని 1వ వార్డు శ్రీహరిపేట, సీతారాంపురంలో వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థల సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ (టైలరింగ్) కార్యక్రమాన్ని విప్ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ శిక్షణ ద్వారా మహిళలకు స్వావలంబన సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, బందెల రవీంద్ర పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో కేన్సర్‌కు పూర్తిస్థాయి చికిత్స

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే బాధితులకు పూర్తిస్థాయిలో చికిత్స అందించొచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, డాక్టర్ సోమరాజు అన్నారు. స్థానిక ఆర్‌టిసి డిపోలో గురువారం ఆర్‌టిసి సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కేన్సర్ కన్సల్టేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో మనిషికి ఆరోగ్యపరమైన సమస్యలు అనేకమైనవి ఉన్నప్పటికీ కేన్సర్ లాంటి పెద్ద వ్యాధులు వస్తే మాత్రం సగం భయంతో జీవితాన్ని భయానకంగా గడుపుతారని అన్నారు. అన్ని సమస్యలకూ మందులు ఉన్నప్పటికీ పెద్దపెద్ద రోగాలకు ముందుగా మనం భయపడే తీరు మన రోగాన్ని పెంచుతుందన్నారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ పి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేన్సర్ నిర్ధారించుకునేందుకు ప్రత్యేక పరికరాలతో ఉచిత మెగా కేన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమని, ఉచిత మెడికల్ క్యాంప్‌ను అందరూ వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం 170 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

పెంటపాడు:కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, మండల కమిటీ సభ్యులు దూలం ప్రసాద్, బంకురు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం పాలనపై సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన పుస్తకాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుబ్బిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, పెనగంటి దుర్గ, దత్తు మీసాల శ్రీను, రాజేష్, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఆకివీడు విద్యార్థి

ఆకివీడు: స్థానిక జెడ్‌పి బాలుర హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి తెలిపారు. కొల్లి శాన్వి నూజివీడు ట్రిపుల్ ఐటికి, కోటప్రోలు మణికంఠ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైనట్లు ఆయన చెప్పారు.

జెసికి సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - ఉండి

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ విజయవాడలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతుగా ఉండి మండల సచివాలయ ఉద్యోగులు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్లకు పదోన్నతి కల్పించడం, గ్రామ సచివాలయాల్లో గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన జాహ్నవి

ప్రజాశక్తి - పాలకొల్లు

అమెరికా ప్రయివేటు అంతరిక్ష పరిశోధనా సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ చేపట్టిన టైటాన్ స్పేస్ మిషన్‌కు ఆస్ట్రోనాట్ క్యాండిడేట్‌గా ఎంపికైన పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి బుధవారం మంత్రి లోకేష్‌ను ఉండవల్లిలో కలిశారు. శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంతో కలిసి ఉండవల్లి నివాసంలో లోకేష్‌ను కలిశారు. అంతరిక్షంలోకి అడుగుపెట్టబోతున్న భారతీయ తొలి తెలుగు మహిళగా జాహ్నవి ఘనత సాధించారు. 2029లో ఆమె తన మొదటి అంతరిక్ష యాత్రలో పాల్గొననుంది. స్పేస్ మిషన్‌కు వ్యోమగామి అభ్యర్థిగా ఎంపికైన జాహ్నవిని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ అభినందించారు. జాహ్నవి సాధించింది మైలురాయిగా నిలుస్తుందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యాశాఖ చేపట్టే స్టెమ్ అవుట్ రీచ్ యాక్టివిటీలో ప్రభుత్వం తరపున భాగస్వామి కావాలని కోరారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

18 సంవత్సరాల్లోపు చిన్నారులను దుకాణాల్లో పనులకు నియమించుకుంటే యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పాలకొల్లుకు చెందిన కార్మిక శాఖాధికారి పి.రాజేంద్రపాల్ హెచ్చరించారు. మొగల్తూరులోని పలు దుకాణాలను కార్మిక శాఖాధికారులు గురువారం తనిఖీలు చేశారు. బడిఈడు పిల్లలను బాల కార్మికులుగా ఏవిధమైన దుకాణాల్లో పని చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. పలు దుకాణ యజమానులకు కార్మిక చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది స్వర్ణలత, పోలీసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆహార భద్రతా సంస్థ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

జాతీయ ఆహార భద్రత సంస్థ ఆమోదించిన నియమాలు ప్రతి ఆహార సంస్థా తప్పక పాటించాలని ఇఒపిఆర్‌డి తాళ్ల మూర్తిబాబు చెప్పారు. ఎంపిడిఒ కార్యాలయంలో పట్టణానికి చెందిన వివిధ ఆహార పదార్థాల తయారీదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ పార్టనర్ కెవిజివిఎం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫాస్టాక్ శిక్షణ, సర్టిఫికెట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని యశోదాదేవి నిర్వహించారు. రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, మెస్‌లు, పానీపూరీ, స్వీట్ షాప్, జ్యూస్ సెంటర్ దుకాణాదారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

పెనుమంట్ర: నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేయడం కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం నెగ్గిపూడిలో అంబేద్కర్ రోడ్డు, లూథరన్ చర్చి సమీప కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు, పంచాయతీ సర్పంచి ఎం.లక్ష్మి, ఉపసర్పంచి సాయిరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. రెవెన్యూ డే (జూన్ 20)ను పురస్కరించుకుని గురువారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో తహశీల్దార్, రెవెన్యూ అధికారులు ఎంఎల్ఎకు జ్ఞాపిక అందించి సత్కరించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో చోటుచేసుకున్న తప్పులను వెంటనే సరి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రావి రాంబాబు, డిటి, విఆర్ఒలు పాల్గొన్నారు.

వర్షాలతో రోడ్లు అధ్వానం!

పెనుగొండ:కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. గుంతలు పడిన రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ములపర్రు నుంచి చినమల్లం రహదారి అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణం నరకయాతనగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు

భవిష్యత్ అవసరాలు తీర్చే విధంగా ప్రణాళికలు

తణుకు మున్సిపల్ మాస్టర్ ప్లాన్ తయారీపై ఎంఎల్ఎ సమీక్ష

తణుకు:భవిష్యత్తు తరాలకు, అవసరాలకు ఉపయోగపడే విధంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందని, ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో తణుకు పురపాలక సంఘానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ తయారీలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంఎల్ఎ మాట్లాడుతూ 1984లో అప్పటి తొలి మున్సిపల్ ఛైర్మన్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ మాస్టర్ ప్లాన్ తయారుచేసి భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విధంగా 1990లో ప్లాన్ అమలు చేశారన్నారు. ప్రస్తుతం 24 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నుంచి భవిష్యత్తులో 85 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీని ప్రకారం తణుకుతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్లాన్ రూపకల్పనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా తణుకు పురపాలక సంఘంలో విలీనం అయ్యే 11 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ముఖ్యంగా భవిష్యత్తు అవసరాల కోసం రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ టవర్లు, పార్కులు, పాఠశాలల నిర్మాణంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్లాన్‌లో పొందుపర్చాలని కోరారు. పలు శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నేతలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు వెళ్లనివ్వడం లేదు

తహశీల్దార్‌కు పెదగరువు గ్రామస్తులు ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శ్మశానవాటికకు వెళ్లకుండా అక్కడి రైతులు తమను ఇబ్బంది పెడుతున్నారని పెదగరువు గ్రామస్తులు తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. పెదగరువు గ్రామంలో ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన సుమారు 300 కుటుంబాలు జీవిస్తున్నారు. ఆ గ్రామంలో ఎవరైనా చనిపోయినా అక్కడి శ్మశానంలో ఖననం చేసేవారు. అయితే ఆ శ్మశానవాటిక సరిపోక ఇబ్బంది పడుతుండడంతో దొడ్డ శ్రీనివాసరావు 8 సెంట్లు, యాదవ్ రెడ్డి సాంబమూర్తి 4 సెంట్లు స్థలాన్ని శ్మశాన వాటికకు ఇచ్చారు. అయితే అక్కడకు వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో తహశీల్దార్‌కు తెలపగా కాలువ గట్టు నుండి శ్మశాన వాటికకు వెళ్లడానికి సర్వే చేయించి సరిహద్దులు ఏర్పాటు చేసి మార్గం చూపించారు. కాలువ గట్టు పక్కగా ఉన్నా ఓ రైతు గుణ్ణం నాగబాబు ఆ దారిన మృతదేహాలను తీసుకెళ్లకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఈ మార్గానికి మంత్రి నిమ్మల రామానాయుడు గ్రావెల్ రోడ్డు వేసేందుకు రూ.18 లక్షలు కూడా మంజూరు చేశారు. మరళా ఇబ్బందులు కలుగజేయడంతో తహశీల్దార్‌కు పెదగరువు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

మొగల్తూరులో అన్నదానం

మొగల్తూరు:మొగల్తూరు కోట రోడ్డులోని దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా దత్త సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం:ప్రధాన విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నరసాపురం ఎలక్ట్రికల్ ఇఇ కె.మధుసూదన్ చెప్పారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంతం, మూడు బొమ్మల సెంటర్, బస్టాండ్ ప్రాంతం, అరుంధతీపేట, చిన మామిడిపల్లి, బంగారు పేట, రుస్తుంబాద, సరిపల్లి, రాయిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, వీవర్స్ కాలనీ, కొల్లాబత్తులవారిపేట, సిటీలో స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వీరవాసరం: ఈనెల 27న భీమవరంలో సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం వీరవాసరం మండలంలో వీరవాసరం, కొణితివాడ, మత్స్యపురి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వీరవాసరం ట్రాన్స్ కేంద్రం అప్పారావు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని వీరవాసరం, రాయకుదురు, తోలేరు, పంజా వేమవరం, నందమూరి గరువు, పెర్కిపాలెం, చింతలకోట గరువు, కొణితివాడ, నవుడూరు, అండలూరు, మడుగు పోలవరం, నౌడూరు గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఉండి: ఉండి, యండగండి విద్యుత్ ఉప కేంద్రాల మరమ్మతుల కారణంగా మండలంలోని ఉండి, ఎన్ఆర్‌పి అగ్రహారం, మహదేవపట్నం, చిలుకూరు, వెలివర్రు, కలిసిపూడి, చెరుకువాడ, చినపుల్లేరు, పెదపుల్లేరు, ఉనుదుర్రు, యండగండి గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్వారైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆకివీడు : ఈనెల 27న ఆకివీడులో ఉదయం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. 11కెవి లైన్ల ట్రీ కటింగ్ ఏర్పాటు నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని ఆయన తెలిపారు. ఇండస్ట్రియల్, డిపి అగ్రహారం, దుంపగడప లైన్లకు మాత్రం సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కాళ్లకూరు వెంకన్నకు రూ.20.36 లక్షల ఆదాయం

కాళ్ల:కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీలెక్కింపు నిర్వహించారు. 98 రోజులకు గాను యాత్రికులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.20,36,795 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. మహిళా మండలి సభ్యులు, దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు, ఆకివీడు సమూహ దేవాలయాల కార్యనిర్వహణ అధికారి అల్లూరి సత్యనారాయణరాజు సమక్షంలో లెక్కింపు నిర్వహించారు.

జాబ్ మేళాలో 173 మందికి ఉద్యోగాలు

పెనుగొండ: స్థానిక విశ్వతేజ డిగ్రీ కళాశాలలో 1 ఎంఐబి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ఉద్యోగ మేళాలో 285 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వారిలో వివిధ కంపెనీల్లో 173 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పులిగడ్డ శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.